

స్వచ్ఛతాహిసేవా కార్యక్రమంలో భాగంగా వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి



చాగలమర్రి: నేలంపాడులో నేలకొరిగిన మొక్కజొన్న



రుద్రవరం: నాగులవరం సమీపంలో పసుపు పంటలో వర్షం నీరు



చిలకలూరు గ్రామ సమీపంలో వంతెనపై ప్రవహిస్తున్న నీరు

వరుణదేవా ఇక చాలు!

- పొలాల్లో వర్షపు నీరు చేరడంతో రైతుల్లో ఆందోళన
- పొంగిపొర్లిన వాగులు, వంకలు ● స్తంభించిన రాకపోకలు

జిల్లాలో గత నెల రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సాగు చేసిన పంటలన్నీ నాశనమవుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయవుతున్నాయి. వర్షాలు ఇక చాలు అని వరుణదేవుడిని రైతులు వేడుకుంటున్నారు. ఆదివారం ఆత్మకూరు, చాగలమర్రి, మహానంది, రుద్రవరం, కొలిమిగుండ్ల మండలాల్లో భారీ వర్షం కురుసింది. పంటలన్నీ నీటమునిగాయి.

రుద్రవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షం 40.4 ఎంఎంగా నమోదయింది. పేరూరు, చిలకలూరు, ఎర్రగుడిదిన్న గ్రామాల సమీపంలో వకుళానది పొంగి ప్రవహించింది చిలకలూరు గ్రామ సమీపంలో వకుళానదిపై వెళ్లకుండా రహదారికి అడ్డంగా కంప వేశారు. చిలకలూరు గ్రామ ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎర్రగుడిదిన్నె వైపు వెళ్లి బయటి గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం మధ్యాహ్నం నుంచి నంద్యాల - రుద్రవరం ఆర్టీసీ సర్వీసులు నిలిచాయి. రెండు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రుద్రవరం - నంద్యాల రహదారిలో రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

500 ఎకరాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న

గాలివానకు సుమారు 500 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. కోటకొండ, కొత్తూరు, శ్రీరంగాపురం, డి.కొట్టాల, యల్లావత్తుల, టి.కొట్టాల గ్రామాల పరిధిలో మొక్కజొన్న పంట నేలవాలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నరసాపురం, ముత్తలూరు, ఆలమూరు, చిత్తరేణిపల్లె గ్రామాల్లో రహదారులపై ఆరబోసిన మొక్కజొన్న సుమారు 2వేల ఎకరాల్లో సాగు చేసిన ధాన్యం తడిచిపోయిందని రైతులు తెలిపారు.

వర్షాలకు ఇబ్బందులు పడిన ప్రజలు

చాగలమర్రి: మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసింది. 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో రాంపల్లే, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. నేలంపాడు గ్రామంలో వరద నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గొట్లూరు, రాంపల్లే, జంగాలపల్లె, కొట్టాలపల్లె, నేలంపాడు గ్రామాల్లో వరద నీరు పంట పొలాల్లో ప్రవహించి సాగు చేసిన వెయ్యి ఎకరాల మొక్కజొన్న దెబ్బతిని నేలవాలి కుళ్లిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రాంపల్లే గ్రామంలో వర్షానికి ఆదివారం మట్టిమిద్దె కూలింది. గ్రామానికి చెందిన దూదెకుల దస్తగిరి మట్టిమిద్దె కుప్పకూలి నష్టం వాటిల్లింది. మిద్దెలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాగలమర్రి తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది 12 వేల క్యూసెక్కులతో ప్రవహిస్తున్నట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు.

రోడ్లపై నిలిచిన నీరు

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతంలో ఆదివారం కురిసిన భారీ వర్షంతో 52.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో పట్టణంలో పలు లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో జనం తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. పట్టణంలోని కేజీ రోడ్డు, కప్పలకుంట, అప్పారావువీధి తదితర ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. వర్షాల వల్ల మినుము, మొక్కజొన్న తదితర పంట పొలాల్లో భారీ నీరు నిలిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పట్టణ శివారులోని భవనాశి నది, పడేవాగులో ఉధృతంగా ప్రవహించాయి. మండలంలోని సిద్ధాపురం చెరువు, వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌లో గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వలు చేరుకున్నాయి.



ఆత్మకూరు: పడేవాగులో ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

కొలిమిగుండ్ల: జోరుగా కురుస్తున్న వర్షాలు రైతులను ఆందోళన చెందేలా చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 10 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు మండల ఏఎస్‌వో భాస్కరరెడ్డి ఆదివారం వెల్లడించారు. మండలంలోని మీర్జాపురం, బెలుం, బెలుంశింగవరం, కొలిమిగుండ్ల, పెట్నీకోట తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షం వివిధ వర్గాల ప్రజలను, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.

ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతా

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- రెండు ఎలక్ట్రిక్ ఆటోలు ప్రారంభం

బనగానపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఏపీ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహిసేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య వ్యర్థాల సేకరణ కోసం రూ.8.75లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు నూతన ఎలక్ట్రికల్ ఆటోలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యసేవలందించి, మందులు పంపిణీచేశారు. స్వచ్ఛ బనగా నపల్లెలో భాగంగా గతంలో రూ.68.54 లక్షల వ్యయంతో 14 టన్నుల స్మార్ట్ కంపాక్టర్ మిషన్‌తో పాటు 28 డస్ట్‌బిన్లు కొనుగోలు చేసి వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో వీటి వల్ల మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. దోమలు, ఇతర క్రిమి కీటకాల నిర్మూలనకు రూ.3.92లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 2 ఫాగింగ్ మిషన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఇప్పటికే పట్టణంలో గణనీయమైన మార్పులు తెచ్చామన్నారు. ఇప్పటికే 80శాతం ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దామన్నారు. బనగానపల్లెను ఐదు జోన్లుగా విభజించి ఐదుగురు సూపర్‌వైజర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వీరు పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, డీపీవో లలితాబాయి. డీఎల్‌పీవో నరసింహారెడ్డి, ఈవోఆర్డీ బాలాంజనేయులు, ఈవో సతీశ్‌రెడ్డి, పలుకూరు కార్యదర్శి మహేశ్వరప్ప, టీడీపీ నాయకులు అల్తాఫ్ హుసేన్, సలాం, వల్లెపు శంకర్, పారిశ్రామికవేత్త గాలి మద్దిలేటిరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీడిన వ్యక్తి అదృశ్యం మిస్టరీ

మనోధైర్యం.. జీవన విజయం 7

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారి ఆలయ మండపంలో 9 గంటలకు యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఈవో ఎం.శ్రీనివాసరావు వివారాలు వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 మంది ఋత్విలకు పిలిపించినట్లు తెలిపారు.

రేపటి కార్యక్రమాలు

అమ్మవారు రెండో రోజు మంగళవారం బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లు మయూర వాహనంపై విహరించనున్నారు.

ఆగిన పనులు

- బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో?
- బిల్లుల చెల్లింపులో గత ప్రభుత్వం అలసత్వం



కొలిమిగుండ్లలో నిలిచిపోయిన బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం తలపెట్టిన బీపీహెచ్ యూనిట్ల నిర్మాణానికి మూడేళ్లవుతున్నా మోక్షం లభించడం లేదు. గ్రామీణ పేద ప్రజలకు ఉచితంగా వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి బ్లాక్ పబ్లిక్ హెల్త్ (బీపీహెచ్) యూనిట్లు ఏర్పాటు చేయాలని భావించిన గత ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో ఎంతో ప్రాధాన్యం కలిగిన ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూ నిలిచిపోయాయి. జిల్లాలో సామాజిక ఆరోగ్య కేంద్రాలకు దూరంగా, రూరల్ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలను గుర్తించి బీపీహెచ్ యూనిట్లు మంజూరు చేశారు. పేదలు వ్యాధి నిర్ధారణ కోసం పట్టణాలకు వెళ్లే పరిస్థితి లేకుండా ఈ బీపీహెచ్ కేంద్రాల్లోనే ఉచితంగా 30 రకాల పరీక్షలు చేయాలన్నది వీటి ప్రధాన లక్ష్యం. జిల్లా వ్యాప్తంగా 7 బీపీహెచ్ యూనిట్ల నిర్మాణానికి పూనుకున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున రూ.3.50 కోట్ల నిధులతో నిర్మాణాలు ప్రారంభించారు. జిల్లాలోని కొలిమిగుండ్ల, నొస్సం, ప్యాపిలి, పాములపాడు, శిరివెళ్ల, గడివేముల, బండిఆత్మకూరు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బీపీహెచ్ యూనిట్ల నిర్మాణాలు నిధులలేమితో లక్ష్యాన్ని చేరుకోలేక చతికిలపడ్డాయి. కొన్ని చోట్ల భవనాలు పూర్తికాగా, మరి కొన్ని చోట్ల వివిధ దశల్లో ఆగిపోయాయి. నాడు-నేడు కింద విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని గొప్పలు చెప్పుకొన్న గత వైసీపీ ప్రభుత్వం, బీపీహెచ్ యూనిట్లకు బిల్లులు చెల్లించకుండా ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని గ్రామీణ ప్రజలు వ్యాధుల నిర్ధారణ పరీక్షల కోసం, పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

బిల్లుల చెల్లింపు జాప్యంతోనే..

ఏడాదిలోపు పూర్తి కావాల్సిన భవన నిర్మాణాలు మూడు సంవత్సరాలైనా పూర్తి కాకపోవడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారనమన్న విమర్శలు ఉన్నాయి. భవన నిర్మాణాలు ప్రారంభించి, నిర్మాణాలు 75శాతం పూర్తి చేసినా గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతోనే నిర్మాణాలు ఆగిపోయాయని పలువురు విమర్శిస్తున్నారు. 60శాతం నిధులు మాత్రమే విడుదలైనట్లు సమాచారం. కొన్ని చోట్ల భవానలు పూర్తయినా, సాంకేతిక సమస్యలతో ప్రారంభం కాలేదు. అయితే సక్రమంగా బిల్లులు చెల్లించి ఉంటే ఏడాదిలో బీపీహెచ్ యూనిట్ల భవనాలు పూర్తయ్యేవని పలువురు పేర్కొంటున్నారు.

ఈ ప్రభుత్వమైనా దృష్టి సారించేనా?

రాష్ట్రంలో అధికారం చేపట్టి కూటమి ప్రభుత్వమైనా బీపీహెచ్ యూనిట్లపై శ్రద్ధ పెట్టాలని ఆయా ప్రాంతాల్లోని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. భవన నిర్మాణాలు పూర్తిచేసి, సిబ్బందిని నియమిస్తే పేదల ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొంటున్నారు. 30 రకాల దీర్ఘ, స్వల్పకాలిక వ్యాధుల నిర్ధారణ, ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. త్వరగా వీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

శ్రీశైలానికి పెరిగిన వరద

- 10 గేట్ల ద్వారా నీటి విడుదల



శ్రీశైలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు పది గేట్ల ద్వారా 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువ సాగర్‌కు సాగనంపుతున్నారు. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 2,37,023 క్యూసెక్కులు వచ్చి చేరింది. ఆదివారం సాయంత్రం డ్యాం నీటిమట్టం 883 అడుగులు ఉండగా నీటి నిల్వ సామర్థ్యం 209 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,626 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గడిచిన 24 గంటల్లో 31 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 9.30గంటల నుంచి కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా మీకు సమీపంలోని మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులను అందజేయవచ్చని, మీకోసం వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

600 క్వింటాళ్ల ఉల్లి అమ్మకం

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో 600ల క్వింటాళ్ల ఉల్లిని అమ్మినట్లు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1,250 బస్తాల ఉల్లిగడ్డలను వినియోగదారులకు విక్రయించామని, మరి కొంత మొత్తంలో రాష్ట్రంలోని రైతుబజార్లకు తరలించామన్నారు. సోమవారం నుంచి ఇప్పటిదాకా అమలైన క్వింటానికి రూ.1,200 మద్దతు ధర ఉండదని, రైతులు గమనించాలని విజ్ఞప్తిచేశారు. సీఎం ఉల్లి సాగు చేసిన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించేందుకు నిర్ణయించారని, అందువల్ల రూ.1,200ల మద్దతు ధర ఇక అమలులో ఉండదన్నారు. సమావేశంలో సెక్రెటరీలు రెహిమాన్, వెంకటేశ్వర్లు, సుందర్ రాజు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.



ఉల్లి కోసం క్యూలో నిలబడ్డ ప్రజలు

ఉల్లి కోసం పరుగులు

- బస్తా రూ.100కు అమ్మకం

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కోసం నగర ప్రజలు పరుగులు పెట్టారు. ఆదివారం యార్డు ప్రాంతమంతా జాతరను తలపించింది. కలెక్టర్ సిరితో పాటు జేసీ నవ్య యార్డులో కలియ తిరుగుతూ పర్యవేక్షిం చారు. రెవెన్యూ, పోలీసు, మార్కెట్ కమిటీ యార్డులను సమన్వయ పరిచి ఉల్లి అమ్మకాల్లో తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ అధికారులు 19వేల క్వింటాళ్ల ఉల్లిని యార్డులో నిల్వ ఉంచారన్నారు. ఈ ఉల్లిని త్వరితగతిన బయటకు తరలించేందుకు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఒక బస్తా ఉల్లి (45కిలోలు) రూ.100 అమ్మేందుకు నాలుగు కౌంటర్లను యార్డులో ఏర్పాటు చేశామన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం రాజు, మార్కెట్ కమిటీ సెక్రెటరీ జయలక్ష్మి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాలితమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఉమ్మడి జిల్లాలోని ఆలయాల్లో ఏర్పాట్లు
- అమ్మవారికి రోజువారీ అలంకరణలు



విద్యుత్ కాంతులతో కర్నూలులోని చిన్నఅమ్మవారిశాల

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకను పురస్కరించుకొని దుర్గామాతను ఆరాధిస్తూ తొమ్మిది రోజుల పాటూ కొనసాగే 'దేవీ నవరాత్రి ఉత్సవాలు' ఉమ్మడి జిల్లాలో సోమవారం ఘనంగా ఆరంభమవుతున్నాయి. ఏటా ఆశ్వయుజ మాసంలో పాడ్యమి నుంచి దశమి వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో దసరా పండుగకు ముందుగా తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహాశైవ క్షేత్రాలైన శ్రీశైలం, మహానందితోపాటూ వివిధ క్షేత్రాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు (అమ్మవారి శాలల్లో), చౌడేశ్వరి దేవి ఆలయాలు దేవీ నవరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆయా దేవాలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల ప్రత్యేకతను చాటేలా ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది రూపాల్లో విశేష అలంకరణలు చేసి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలు శరత్ కాలంలో వస్తున్నందున 'శరన్నవరాత్రి వేడుకల' పేరుతోనూ జిల్లాలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

మహాశక్తి స్వరూపిణిగా అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన మాతకు దేవీ భాగవతంలో త్రిమూర్తుల కన్నా అధిక ప్రాధాన్యత కల్పించారు. విజయం చేకూరాలంటే ఈ శక్తిని అందుకోవడం తప్పనిసరిగా వర్ణించారు. నవవిధ అవతారాలను అత్యంత భక్తితో పూజించే పర్వదినాలే దేవీ నవరాత్రులు. త్రిశక్తుల ఏకీకరణ సమన్వయాన్ని సాధించే దిశలో ఆదిశంకరాచార్యులు మహాలక్ష్మిని కనకధార స్తోత్రంలో కీర్తించారు. వైదిక సంప్రదాయంలో దేవీమాతను త్రిమూర్తుల శక్తిగా తెలియజేశారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతిగా కొలుస్తారు. మహాకాళిని శత్రు నిర్మూలనకు, మహాలక్ష్మిని ఐశ్వర్య సౌభాగ్య సంపదలకు, సరస్వతిని విద్య విజ్ఞానానికి అధిష్ఠాన దేవతగా భావిస్తారు. విశ్వసృష్టికి నాంది పలికిన జగన్మాతగా దుర్గామాతను పూజిస్తారు. బ్రహ్మ, విష్ణువు, శివపరమాత్మ కూడా దేవదేవిని పూజించారని హైందవ పురాణాలు చెబుతున్నాయి. దుర్గామాత అయిన దేవదేవిని తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రూపాల్లో పూజించాలి. నేయి దీపాలు వెలిగించి, నిత్యం హోమాలు, పూజలు, అష్టోత్తర నామ పారాయణం, స్తుతి, భజనలతో ఆరాధించాలి. అరిషడ్ గుణాలను వదులుకొని దేవీ ఆరాధనలో గడిపేవారికి ఆమె కరుణా కటాక్షాలు ప్రసాదిస్తుందని పండితులు పేర్కొంటారు.

నవరాత్రుల్లో అమ్మవారి అలంకరణలు

దేవీ నవరాత్రి వేడుకల్లో తొమ్మిది రోజుల పాటు దేవదేవి అయిన దుర్గమ్మను తొమ్మిది రూపాల్లో దర్శిస్తారు. ఈ తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో దుర్గామాతను అలంకరించి, విశేష పూజలు నిర్వహిస్తారు. శైలపుత్రి, బాల త్రిపురా సుందరీ దేవి (బ్రహ్మచారిణి), చంద్రఘంటా దేవి (గాయత్రీ దేవి), అన్నపూర్ణా దేవి, లలితా త్రిపుర సుందరీ దేవి, మహాలక్ష్మి దేవి, మహా సరస్వతీదేవి, దుర్గాదేవి (దుర్గాష్టమి), మహిషాసుర మర్దిని (మహార్ణవమి), రాజరాజేశ్వరి (విజయ దశమి) రూపాల్లో భక్తులు అమ్మవారిని పూజిస్తారు.



ఆహ్లాదభరితం.. నల్లమల సోయగం

నల్లమల అందాలు ఆహ్లాదభరితంగా ఉన్నాయి. పచ్చదనంతో నిండిపోయిన అడవికి తెల్లటి పొగమంచు దుప్పటి కప్పేసింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మహానందికి అత్యంత సమీపంలోని నల్లమల అడవికి పొగమంచు కప్పినట్లు ఉన్న దృశ్యాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరో ఊటీ అందాలను తిలకించినట్లు ఉందని మహానందికి దర్శనం కోసం వచ్చిన భక్తులు హర్షం వ్యక్తంచేశారు. ఈముగ్ధ మనోహర దృశ్యాలను ఆదివారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

● మహానంది, ఆంధ్రజ్యోతి

సనాతన ధర్మంపై చైతన్యం తీసుకురావడానికి పాదయాత్రలు

- ఇస్కాన్ ప్రతినిధి ఆచార్య దాస్



చాగలమర్రిలో పాదయాత్ర చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

చాగలమర్రి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పాదయాత్రలు చేపట్టినట్లు ఇస్కాన్ ప్రతినిధి ఆచార్య దాస్ అన్నారు. ఇస్కాన్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం చాగలమర్రికి చేరుకుంది. సనాతన ధర్మం, నగర సంకీర్తన కోసం ఎద్దుల బండితో 25 మంది భక్తబృంద సభ్యులతో పాదయాత్ర చేపట్టారు. ఇప్పటికే ఆరు సార్లు పూర్తిచేసుకొని ప్రస్తుతం ఏడో సారి దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆచార్య దాస్ మాట్లాడుతూ కేదర్‌నాథ్, బద్రినాథ్, ద్వారక, పలు క్షేత్రాలను తిరిగామన్నారు. అక్కడి నుంచి మంగళగిరి, గుంటూరు, మార్కాపురం, గిద్దలూరు మీదుగా నంద్యాల, రుద్రవరం, అహోబిలం సందర్శించి చాగలమర్రికి చేరుకున్నామన్నారు. స్థానిక అయ్యప్ప, సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల గుండా ఎద్దులబండితో నగర సంకీర్తన, భగవద్గీత, రామాయణం, గ్రంథాల వితరణ, ప్రసాద వితరణతో పాదయాత్ర చేశారు. వీరికి హిందూ సంఘ నాయకులు స్వాగతం పలికారు. సోమవారం నుంచి కడప జిల్లాలో పాదయాత్ర సాగుతుందని, ప్రతి రోజు ఎద్దులబండితో పాటు 10కిలోమీటర్లు యాత్ర చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు జనార్ధన్, లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్
- ఘనంగా రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ఏదో ఒక క్రీడల్లో ప్రోత్సహించాలని నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అన్నారు. ఆదివారం నంద్యాల మార్కెట్ యార్డులో క్రీడాభారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈపోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులోనే ప్రోత్సహిస్తున్నారన్నారు. పిల్లలకూడా సెల్‌ఫోన్లకు పరిమితమై ఆటలను విస్మరిస్తున్నారని అన్నారు. క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడ జిల్లాలో కొన్ని పాఠశాలల్లో ఉందని, ఈ క్రీడాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల, కర్నూలు, కడప, జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు కప్పు, మెడల్స్ ముఖ్య అతిథులు ప్రదానం చేశారు. క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి రామక్రి ష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి. నిమ్మకాయల సుధాకర్, హేమంత్‌రెడ్డి, ఖలీల్, గెలివి వెంకటేశ్వర విద్యాలయ కరస్పాండెంట్ గెలివి వశిష్ట పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

ఉరుకుంద ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



వెండి అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి వారు

కౌతాళం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ వాణి ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. తూర్పు రాజగోపురం నుంచి ఆలయ అధికారులు భక్తులకు స్వామివారి దర్శనం కల్పిం చారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. మరి కొంత మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యం సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలోని అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

సీమ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి

- కుంచం వెంకటసుబ్బారెడ్డి

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల నేతలు వెనుకబడిన ప్రాంతాల శాశ్వత అభివృద్ధికోసం పాటుపడాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం 88 ఏళ్ల క్రితం శ్రీబాగ్ ఒప్పందం జరిగిందని, కానీ అమలుకు నోచుకోకపోవడమే రాయలసీమ వెనుకబాటుకు కారణమన్నారు. దేశంలోనే రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, సమగ్ర అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక రాష్ట్రంగానీ, గతంలోని జరిగిన ఒప్పందాల అమలు మాత్రమే పరిష్కారమని స్పష్టం చేశారు. నవంబరు 16లోగా శాశ్వత పరిష్కారానికి రాయలసీమ నాయకులు సిద్ధం కావాలన్నారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల నీటి వినియోగంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాయలసీమ, కోస్తా జిల్లాలకు సమానంగా శాసనసభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కోడుమూరులో డెకాయ్ ఆపరేషన్

- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న వైద్య బృందం
- పరారైన వైద్యుడు ● ప్రైవేటు ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిని సీజ్ చేసిన కర్ణాటక, కర్నూలు వైద్య బృందం

కోడుమూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాషా నర్సింగ్ హోమ్‌పై ఆదివారం సాయంత్రం డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పీసీ పీఎన్‌డీటీ స్టేట్ నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, కర్ణాటక పీసీ పీఎన్‌డీటీ స్టేట్ వివేక్‌దొరై, డీఎంహెచ్‌వో శాంతికళ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఆస్పత్రిని సీజ్‌చేసినట్లు తెలిపారు. వివరాలు.. కర్ణాటకలో వచ్చిన ఫిర్యాదు మేరకు కర్ణాటక, కర్నూలు వైద్యం బృందం సహకారంతో డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా ఆరునెలల గర్భిణికి మైక్ ఏర్పాటు చేసి బాషా నర్సింగ్ హోమ్‌కు పంపించారు. కొంత డబ్బు తీసుకొని లింగనిర్ధారణ పరీక్షలు చేసి గర్భంలో ఉన్నది ఆడ శిశువు అని వైద్యుడు నిర్ధారించాడు. ఈ సమయంలో వైద్య బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పరీక్షలు నిర్వహించిన యునాని వైద్యుడు అక్కడి నుంచి పరారయ్యాడు. నిబంధనల ప్రకారం ఆస్పత్రిని సీజ్‌చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఏడుగురు రోగులను మరో హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. బహిరంగంగా లింగనిర్ధారణ పరీక్షలు చేపట్టడంపై స్టేట్ నోడల్ ఆఫీసర్ జిల్లా వైద్యాధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

గతంలో కూడా ఈ ఆస్పత్రిపై..

బాషా నర్సింగ్‌హోమ్‌లో కొన్నేళ్ల నుంచి లింగనిర్ధారణ పరీక్షలు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో కూడా ఈ ఆస్పత్రిపై దాడులు నిర్వహించి సీజ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ ఆస్పత్రి నిర్వాహకుల్లో ఎలాంటి మార్పు లేదు. దీంతో కర్ణాటక, ఏపీలోని పలు జిల్లాల నుంచి గర్భిణులు ఇక్కడికి వచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని వెళ్తుంటారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి అధికారులు కొన్ని సంవత్సరాల కిందట దాడులు చేపట్టి ఆసుపత్రిని సీజ్‌చేశారు. ఇంత జరిగినా ఇదే ఆస్పత్రిలో బహిరంగంగా లింగనిర్ధారణ చేపట్టడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని బనవాసి ఫారం కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల గ్రామానికి చెందిన వెంకట రాముడు(43) ఆదోనిలో పనిముగించుకొని కడివెళ్లకు తిరుగు ప్రయాణమయ్యాడు. తిరుగు ప్రయాణంలో బస్సెక్కి ఆరెకల్లు గ్రామంలో దిగి నడుచుకుంటూ ఎమ్మిగనూరు వైపు వస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

బాలిక మృతి

గడివేముల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందింది. ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గడివేములకు చెందిన ఉసేన్‌బాష, మౌలాబి దంపతులు కుమార్తె అఫ్రిన్‌తో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంలో బోదనంకు వెళ్తున్నాడు. పెస రవాయి గ్రామ సమీపంలోని వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో బైక్ అదుపు తప్పింది. అఫ్రిన్(6) తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విగ్రహ ధ్వంసం కేసులో వ్యక్తి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

ఆలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనేకుర్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహం ధ్వంసం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మనేకుర్తి గ్రామంలో కురువ సామాజికవర్గానికి చెందిన సర్పంచ్ కంటెప్పగారి దేవేంద్ర వర్గానికి, కేసులో నిందితుడైన మరకట్టు భగవంత్ప వర్గానికి కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు విషయంలో వివాదం కొనసాగుతోంది. సర్పంచ్ వర్గీయులు గ్రామంలో జాతీయ రహదారి పక్కన విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించారు. మరో వర్గం ఒప్పుకోకపోయినా అలాగే విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఆతర్వాత సర్పంచ్ వర్గీయులు అవమానకరంగా, రెచ్చగొట్టేలా మాట్లాడారు. దీంతో జీర్ణించుకోలేకపోయిన మరకట్టు భగవంతప్ప మద్యం మత్తులో కనకదాసు విగ్రహం ఎడమచెయ్యి, వీణను పగలగొట్టాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. కమ్మరచేడు గ్రామ ధాబా వద్ద ఉన్న మరకట్టు భగవంతప్పను ఆలూరు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి, సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. విచారించగా అసలు నిజాన్ని ఒప్పుకున్నాడని, నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిద్దెపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఓ విద్యార్థి మిద్దెపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం పట్టణంలో టిడ్కో గృహాల్లో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన బాలుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువాడు. మూడు సార్లు పదో తరగతి ఫెయిల్ అయ్యాడు. దీంతో వ్యసనాలకు బానిసయ్యాడు. వ్యసనాలు మాని బాగా చదువుకోవాలని తల్లి మంద లించింది. మనస్థాపానికి గురైన అతడు నాలుగో అంతస్థు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

నందికొట్కూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి అక్రమంగా తెచ్చి పట్టణ శివారులో విక్రయిస్తుండగా 1,100 గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కావేటి రాజు, పింజరి మహబూబ్ బాషా, దూదేకుల ముర్తుజావళి, షేక్ సోహెల్ గంజాయి అమ్ముతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని చెప్పారు. ఈ నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో వ్యక్తి ఆత్మకూరుకు చెందిన కావేటి నాగశేషాద్రి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ చంద్రశేఖర్‌ను సీఐ అభినందించారు.

మనోధైర్యం.. జీవన విజయం



క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి. ధూమపానం, మద్యపానం, పురుగుమందుల అవశేషాలున్న ఆహార పదార్థాలు తీసుకోవడం వంటివి క్యాన్సర్‌కు ప్రధాన కారకాలుగా వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు, పెద్దలు, మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. చాలా మంది సెలబ్రిటీలు, హీరోలు, క్రీడాకారులు మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. క్యాన్సర్ రోగులకు ఓదార్పునిస్తూ అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏడాది సెప్టెంబరు 22న వరల్డ్ రోజ్ డే (క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం)ను నిర్వహిస్తున్నారు. సోమవారం వరల్డ్ రోజ్‌డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- క్యాన్సర్ రోగికి చికిత్స కంటే సాంత్వన ముఖ్యం
- ప్రత్యేక కౌన్సిలర్లు అవసరం
- నేడు వరల్డ్ రోజ్ డే

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధిని జయించవచ్చు. క్యాన్సర్‌తో పోరాడే వారు కోలుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గులాబీ పువ్వు, యాపిల్ పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పడమే వరల్డ్ రోజ్ డే ముఖ్య ఉద్దేశం. కెనడాకు చెందిన మిలిండా రోజ్ అనే 12 ఏళ్ల బాలిక అస్కిన్ ట్యూమర్ అనే అరుదైన రక్త క్యాన్సర్‌కు గురైంది. అప్పటికే ఆరోగ్యం క్షీణించడంతో రెండు వారాలకు మించి బతకదని వైద్యులు చెప్పారు. మనోధైర్యంతో నిండుగా ఉన్న ఆబాలిక క్యాన్సర్‌కు ఏమాత్రం భయపడ లేదు. ఆసుపత్రిలో తనతో పాటు ఉన్న క్యాన్సర్ రోగులతో ఉత్సాహంగా గడిపేది. తోటి రోగులకు గులాబీ పూలుఇచ్చి త్వరగా కోలుకోవాలని ప్రార్థించేది. బంధువులు, మిత్రులకు ఉత్తరాలు రాసేది. కవిత్వం రాస్తూ ఉల్లాసంగా కాలం గడిపేది. రెండు వారాల కంటే ఎక్కువ బతకుదు అనుకున్న మెలిండారోజ్ ఆరునెలలు జీవించింది. 1894 సెప్టెంబరు22న మరణించింది. ఆబాలిక ఇచ్చిన స్ఫూర్తితో ఎందరిలోనూ ఆలోచలన రేకెత్తించింది. క్యాన్సర్ రోగులకు మానసికంగా ధైర్యంకల్పించి త్వరగా కోలుకోవాలని కోరుతూ సెప్టెంబరు 22న వరల్డ్ రోజ్‌డేను పాటిస్తున్నారు.

ఉచిత స్ర్కీనింగ్ పరీక్షలు

ఉమ్మడి జిల్లాలోని నాన్ కమ్యూనికబుల్ డిసిజ్ కింద(ఎన్‌సీడీ) క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. మగవారిలో నోటి, ఊపిరితిత్తులు, స్ర్తీల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మహిళల కోసం 950 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎన్‌సీడీ-3.0 కింద జిల్లాలో 43 మందికి నోటి క్యాన్సర్, 40 మందికి రొమ్ము, 24 మందికి మహిళలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు ఉన్నట్లు గుర్తించారు.

రాయలసీమలోనే అధికం

రాయలసీమ జిల్లాలో ఎక్కువగా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, పురుషుల్లో నోటి క్యాన్సర్లు అధికంగా కనిపిస్తున్నాయి. పొగాకు, పొగాకుకు చెందిన ఉత్పత్తులు వినియోగించిన వారిలో ఎక్కువగా నోటి, ఊపిరితిత్తులు క్యాన్సర్లు వస్తున్నాయి. స్ర్తీల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు స్థూలకాయం, సంతాన లేమి వంటి కారణాలతో రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు.

రోగులకు భరోసా అవసరం



క్యాన్సర్ రోగులకు సాంత్వన కలిగించడం ప్రధాన అంశం. రోగులకు వైద్యులు చికిత్సకు వచ్చే సమయంలో వారితో మాట్లాడి భరోసా కల్పిస్తుంటాం. వ్యాధి ఏ స్థాయిలో ఉన్నా రోగులకు ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే జయించొచ్చు.

● డాక్టర్ రవీంద్రబాబు, సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, ఓమేగా హాస్పిటల్, కర్నూలు

నోటి క్యాన్సర్లు అధికం



జిల్లాలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా వస్తున్నాయి. ముఖ్యంగా బీడీ, సిగరెట్, గుట్కా వాడటంతో పురుషుల్లో ఈ వ్యాధి అధికమవుతోంది. క్యాన్సర్‌కు అధునాతన చికిత్స విధానాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులు ఆందోళన చెందకుండా ధైర్యంతో ముందుకెళ్లాలి.

● డాక్టర్ వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

వీడిన వ్యక్తి అదృశ్యం మిస్టరీ

- ఆస్తుల విషయంలో దాయాదుల మధ్య వివాదం
- అడ్డు తొలగించుకోవాలని హత్యకు కుట్ర
- చక్కరాళ్ల గ్రామ సర్పంచ్‌కు రూ1.30 లక్షలకు కాంట్రాక్టు
- మద్యం తాగడానికి తీసుకెళ్లి హత్య చేసిన కిరాయి ముఠా
- మృతదేహాన్ని ప్యాపిలి వద్ద లంకాయపల్లిలో పూడ్చిపెట్టిన దాయాదులు



ప్యాపిలి చెరువులో వెలికితీసిన శరీర భాగాలను చూపిస్తున్న సీఐ జయన్న

పత్తికొండ/ప్యాపిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కనిపించడంలేదని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులకు ఆస్తుల విషయంలో తలెత్తిన వివాదంలో దాయాదులు హత్య చేసినట్లు గుర్తించారు. పత్తికొండ మండలంలోని చక్కరాళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పత్తికొండ సీఐ జయన్న ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. చక్కరాళ్ల గ్రామానికి చెందిన లింగాయపల్లి పద్మనాభరెడ్డికి (37) క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన శిరీషతో వివాహయింది. రాతిదూలం పోటీలలో ఎద్దులను తోలడం వృత్తిగా చేసే పద్మనాభరెడ్డి ఆ వృత్తి కోసం నెలల తరబడి ఇంటికి దూరంగా ఉండేవాడు. తన భర్త పద్మనాభరెడ్డి ఈ ఏడాది మే 13 నుంచి కనిపించడం లేదని ఆయన భార్య ఈ నేపథ్యంలో ఆగస్టు 28న ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు వ్యక్తి అదృశ్యం కింద పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. గ్రామంలో అనుమానితులతో పాటు ఆయనతో పరిచయం ఉన్న వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. గ్రామంలో స్థలం విషయంలో దాయాదులతో మే 5వ తేది పద్మనాభరెడ్డికి వివాదం జరిగినట్లు ఆ వివాదంలో దాయాదులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి మరికొందరితో కలసి ఆయనపై దాడిచేసినట్టు విచారణలో గ్రామస్థులు తెలపడంతో ఆ వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. భయపడ్డ నిందితులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు గ్రామ సర్పంచ్ శ్రీరాములు శనివారం గ్రామ వీర్వో తలారి కృష్ణ వద్ద లొంగిపోయారు. తామే పద్మనాభరెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకొన్నారు. నిందితులను ఆయన పత్తికొండ సీఐ జయన్నకు అప్పగించారు. విచారణలో నిందితులు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.



పద్మనాభరెడ్డి (ఫైల్)

హత్యకు పథకం ఇలా..

గ్రామంలో తనకు సంబంధించిన 40సెంట్ల స్థలాన్ని పద్మనాభరెడ్డి సెంటు రూ .40వేల చొప్పున గ్రామస్థులు కొందరికి విక్రయించాడు. అందుకోసం వారి వద్ద నుంచి రూ. 1.30 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. అయితే వారసత్వంగా వచ్చిన ఆస్తులన్నీ ఇప్పటికే అమ్ముకున్నావని, ఈస్థలాన్ని అమ్మేందుకు తాము అంగీకరించబోమని దాయాదులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి అడ్డుకున్నారు. దీంతో మే 5న వారి మధ్య వివాదం జరిగింది. ఈవివాదంలో రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలో మరికొందరితో కలసి ఇనుపరాడ్డుతో దాడిచేసి తీవ్రంగా గాయపడిని పద్మనాభరెడ్డిని ఆటోలో ఆయన తండ్రి ఉండే రాంపురం గ్రామంలో వదిలివేశారు. గాయాల నుంచి తేరుకున్న పద్మనాభరెడ్డి తనపై దాడిచేసిన వారిని వదలబోనని కొందరు గ్రామస్థులతో చెబుతుండేవాడు. దీంతో అతడి నుంచి తమకు హాని ఉందని భావించిన దాయాదులు హత్యచేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం సర్పంచ్ శ్రీరాములు (వైసీపీ)కు రూ 1.30 లక్షలు కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో పద్మనాభరెడ్డిని హత్యచేసేందుకు పథకం రచించిన సర్పంచ్ శ్రీరాముడు తమ్ముడు సిద్ధరాముడుతో పాటు గంపఆయ్యన్న, ఎద్దులదొడ్డి శ్రీరాములు, ప్రసాద్‌తో పాటు మరికొందరు రాంపురం సమీపంలో ఉన్న సుంకులమ్మ దేవాలయం వద్ద మద్యం తాగేందుకు పద్మనాభరెడ్డిని తీసుకెళ్లారు. రాళ్లతో కాళ్లపై దాడిచేసి లుంగీని గొంతుకు బిగించి హత్యచేసి మృతదేహాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారు. అయితే మృతదేహాన్ని అక్కడే వదిలేస్తే ఎలా అని కాంట్రాక్టు ఇచ్చిన దాయాదులు ప్రశ్నించారు. మీరు ఇచ్చిన డబ్బుకు అంతకంటే పనిచేయలేమని సర్పంచ్ శ్రీరాములు వారికి సమాధానం ఇవ్వడంతో పద్మనాభరెడ్డి మృతదేహాన్ని రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి ప్యాపిలి సమీపంలో లంకాయపల్లి చెరువులో గడ్డిపొదలనడుమ పూడ్చివేసి దానిపై రాళ్లుపెట్టారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం పత్తికొండ తహసీల్దార్, డోన్ అగ్నిమాపకశాఖ సిబ్బంది, ఫోరెన్సిక్ సిబ్బంది సమక్షంలో లంకాయపల్లి చెరువులో పద్మనాభరెడ్డి పుర్రె, ఎముకలను వెలికితీశారు. నంద్యాల మెడికల్ కళాశాల ప్రొఫెసర్ హరికృష్ణ ఆధ్వర్యంలో శవపంచానామా నిర్వహించామని, పుర్రె, ఎముకలు గుర్తుపట్టలేని పరిస్థితులలో ఉండడంతో వాటిని డీఎన్ఏ పరీక్షలకు పంపుతున్నామని సీఐ జయన్న తెలిపారు. ఈహత్యకు సంబంధించి రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సర్పంచ్ శ్రీరాములును కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈహత్య కేసుకు సంబంధించి మరో 11 మందిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.



దుండగులు శవాన్ని పూడ్చిన చెరువు ఇదే

పట్టణంలోని మూడిళ్లలో చోరీ

- అర తులం బంగారు, రూ. 32వేలు నగదు అపహరణ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వీవర్స్ కాలనీ దర్గాలైన్‌లో శనివారం రాత్రి మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. వీవర్స్‌కాలనీలో పురుషోత్తం, రవికుమార్, సురేష్ పక్కపక్క పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. ఇరువురు ఇళ్లకు తాళాలు వేసి అమావాస్య పూజలు ఉండటంతో ఊరికెళ్లారు. ఒకరు మాత్రం ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. రెండిళ్ల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లారు. ఆ పక్కనే ఉన్న మరో ఇంటి రేకును కోసి ఇంట్లోకి వెళ్లి అర తులం బంగారు, రూ.32వేల నగదు దోచుకెళ్లారు. ఆదివారం సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఘర్షణ కేసులో అరెస్టు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో ఇటీవల ఘర్షణ పడ్డ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ ఈశ్వర్వయ్య తెలిపారు. వివరాలు.. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెద్దకొట్టాలలో చిన్నబాబు, సంటెన్న మధ్య జరిగిన ఘర్షణలో సంటెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు చిన్నబాబు, రమేష్, సుబ్బన్న, కిషోర్‌కుమార్, వెంకటేశ్వర్లు, సుంకన్న, కరుణాకర్, సువార్తమ్మపై కేసు నమోదు చేసి అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

చిట్టితల్లీ.. నిశ్చింతగా చదువుకో

- సోషల్ మీడియా వేదికగా స్పందించిన మంత్రి నారా లోకేశ్
- కేజీబీవీలో చేర్చిన డీఈవో, అధికారులు
- 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటాం
- విద్యార్థిని జెస్సీ తల్లిదండ్రులు





విద్యార్థిని జెస్సీ, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'చిట్టి తల్లీ.. ఇక నిశ్చింతగా చదువుకో.. కేజీబీవీలో సీటు ఇప్పించే బాధ్యత నాది.' అని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనెల 20వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'సీటు రాక.. చదువు సాగక..!' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈవార్తకు మంత్రి స్పందించి వెంటనే కేజీబీవీ ఎస్‌పీడీ శ్రీనివాసరావు, డైరెక్టర్ దేవానందరెడ్డి, కలెక్టర్ సిరి, డీఈవో శామ్యూల్‌పాల్‌కు జెస్సీని కేజీబీవీలో చేర్చాలని ఆదేశాలు జారీచేశారు. ఆదివారం చిలకలడోన కస్తూర్బా పాఠశాలలో అధికారులు చేర్పించారు. తమ కూతురుకు సీటు రావడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు మీనుగకుమార్, సంతోషమ్మ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటామన్నారు. పాఠశాలకు వచ్చిన డీఈవో స్వయంగా దరఖాస్తు ఫారాన్ని నింపి అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ శాంతికి అందజేశారు. నీకు సీటు రావడానికి మంత్రి లోకేశ్, ఎంతో మంది అధికారులు, నాయకుల కృషి ఉందని, ఉన్నతంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డీఈవో పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'ని ఆయన అభినందించారు. ఇలాంటి కథనాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, ఎంఈవో రాగన్న, రామకృష్ణ వేణి, బూదూరు పాఠశాల హెచ్ఎం రంగనాథ్, భూషణం, సీఆర్‌పీలు బీమేష్, బంగారప్ప, క్లస్టర్ చైర్మన్ లచ్చప్ప పాల్గొన్నారు.

గిరి బలిజ నుంచి 'బలిజ' పదం తొలగించాలి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దొమ్మెరల సామాజిక వర్గ పేరును 'గిరి బలిజ'గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ 'బలిజ' అన్న పదాన్ని తొలగించాలని బలిజ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ నెం.5 బలిజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాపునాడు అధ్యక్షుడు ఆర్వా రామకృష్ణ, విజయభాస్కర్, రామస్వామి, డాక్టర్ కుళ్లాయప్ప, భాస్కర్ బాబు, కప్పట్రాళ్ల మోహన్, బాలరాజు, జనసేన పార్టీ నాయకుడు చింతా సురేష్‌బాబు, మండ్లెం రవికుమార్, నాయకులు ఈశ్వర్‌కుమార్, శైలేష్, అమర్నాథ్, శేషు, సుజాత పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణమ్మకోన పాణ్యం రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. సుమారు 30నుంచి 40ఏళ్ల మధ్య పురుషుడిగా పేర్కొన్నారు. నల్లటి టీషర్టు మృతదేహం సమీపంలో ఉంది. ముదురు ఆకుపచ్చ రంగుగల నైట్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. చేతికి నందిని, ఉష అంటూ పచ్చబొట్టు ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని, సమాచారం కోసం నంద్యాల రైల్వే పోలీసుల సంప్రదించాలన్నారు.



నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు

- వేడుకలకు ఆలయాల ముస్తాబు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవారు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాల్లో నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభంకానున్నాయి. దేవతామూర్తులు సోమవారం నుంచి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయాలను విద్యుత్, పుష్పాలంకరణలతో సుందరీకరించారు. పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాల, నూనెపల్లె అమ్మవారిశాల, బాలాజి కాంప్లెక్స్ కల్యాణమండపం, కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం, బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానం, సంజీవనగర్ రామాలయం, బైటిపేట ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు అమ్మవారి ఒక్కొక్కరోజు ఒక్కో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే ఆయా ఆలయాలలో బొమ్మలకొలువు కూడా ఏర్పాటుచేస్తున్నారు. 22వ తేదీన బాలత్రిపురసుందరిదేవి, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయని దేవిగా, 26న మహాలక్ష్మీగా, 27న లలితాత్రిపుర సుందరీదేవిగా, 28న మహాచండీదేవిగా,29న సరస్వతీదేవిగా, 30న దుర్గాదేవిగా, 1న మహిషాసుర మర్దినిదేవిగా, 2న రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమివ్వనున్నారు.


విద్యుత్ దీపాలంకరణలో దుర్గాదేవి


నంద్యాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం


ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు

మండపాలు సిద్ధం

పట్టణంలో పలు కూడళ్లలో దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు మండపాల ను సిద్ధం చేశారు. 11రోజుల పూజలనంతరము విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

ఆత్మకూరు పట్టణంలో..

ఆత్మకూరు: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని ఆలయాల్లోని దేవతామూర్తులు సోమవారం నుంచి ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరీకరించారు. ప్రత్యేకించి శ్రీకన్యకాపరమేశ్వరీదేవీ ఆలయం, శ్రీచౌడేశ్వరీదేవీఆలయం, కాళికాదేవీ ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, సిద్దేశ్వరాలయం, ఆత్మలింగేశ్వరాలయం, మార్కండేయాలయం, జంబులాపరమేశ్వరీ ఆలయం, శ్రీవెంకటేశ్వరాలయం, అయ్యప్పస్వామిఆలయం, సాయిబాబాఆలయం, గంగాదేవీ, సుంకులమ్మ, మల్లెలమ్మ ఆలయాలకు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. తొలిరోజు సోమవారం శ్రీశైలపుత్రీ దేవీగా, 23న బ్రహ్మచారిణి దేవీగా, 24న చంద్రఘంటాదేవీగా, 25న కూష్మాండ దుర్గాదేవీగా, 26న స్కంధమాతాదేవీగా, 27న శ్రీవెంకటేశ్వరస్వామి అలంకరణ, 28న శ్రీమహాగౌరీదేవీగా, 29న మూలానక్షత్రం సందర్భంగా శ్రీసరస్వతీదేవీగా, 30న శ్రీమహిషాసురమర్ధినిదేవీగా, అక్టోబరు 1న శ్రీసిద్ధిదాయినిదేవీగా, 2న దసరా సందర్భంగా విజయలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే 3వ తేది గ్రామోత్సవం, 4న వసంతోత్సవం క్రతువులను శాస్త్రోక్తంగా జరపనున్నారు. అలాగే పలు ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలను శోభాయమానంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహానందిలో..

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం నుంచి దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపా రు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఆలయ పరిస రాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కామేశ్వరీదేవి అమ్మవారికి ప్రతిరోజు వేకువ జామునసే ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తారని చెప్పారు. ఆలయ మాడవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో పేర్కొన్నారు.


విద్యుత్‌దీపాలంకరణలో ఆలయ గోపురం

మహానందిలో తగ్గని వరద ఉధృతి


ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల ప్రాంగణలోకి చేరిన వరద


గాజులపల్లి ఆర్‌ఎస్ చెంచుగూడెంలోని ఇంటిలోకి చేరిన నీరు

మహానంది, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలపాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో నల్లమలలోని పాలేరు వాగులో ఉధృతి మరింత పెరిగింది. రెండో రోజు కూడా ఈ రహదారిలో మహానందికి రాకపోకలు నిలిచిపోయాయి. పాలేరువాగుకు అత్యంత సమీపంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలకు వరదనీరు భారీగా చేరింది. కళాశాల పరిసరాలు జలదిగ్బంధంతో నిండి పోయింది. దీంతో హాస్టల్ గదుల్లో వ్యవసాయ విద్యార్థులతో పాటు శ్రీవెంటేశ్వర యూనివర్సిటీ పశుపోషణ కేంద్రంలోని ఒంగోలు జాతీ ఆవులు ఇబ్బందులు పడ్డాయి. అలాగే గాజులపల్లి ఆర్‌ఎస్ పంచాయతీ పరిధిలోని చెంచుకాలనీకి వరద నీరు చేరింది. గిరిజనులు అష్ట కష్టాలు పడ్డారు. కాలనీని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ రమాదేవి, ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. గిరిజనులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్డీవో భరోసా ఇచ్చారు. మండలంలోని బొల్లవరం రాళ్లవాగు, ఎయిమ్‌ఫర్ సేవా కేంద్రం ప్రధాన రహదారి వద్ద వరదనీరు పొంగి ప్రవహించడంతో మహానందికి ఆదివారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దాతలు ముందుకు వచ్చి భక్తులకు, చెంచులకు అన్నదానం, నిత్యావసర వస్తువులు అందజేశారు.

సమాజానికి వెలుగుజాడ 'గురుజాడ'

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్యానికి, సమాజానికి వెలుగుజాడలు చూపిన మహాకవి గురుజాడ అప్పారావు అని సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నంద్యాల పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో గురుజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్తలు గురుజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా అమరావతి సెక్రటేరియట్ గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసి అధ్యక్షుడు కేవీ కృష్ణయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో 'గురుజాడ సాహిత్యం- సమకాలీనత' అనే అంశంపై నిర్వహించిన చర్చావేదికలో వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, మాబుబాషా, నరేంద్ర, కొప్పుల ప్రసాద్, డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, రోటరీ డివి సుబ్బయ్య, నీలకంఠమాచారి, గురుజాడ జీవితంపై తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా కేవీ క్రిష్ణయ్యను సాహితీవేత్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ శ్రీధర్, రఫీ, ఈశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.


గురుజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

కొత్తపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. ఆదివారం రాత్రి డీఎస్పీ కొత్తపల్లిలోని బస్టాండు సెంటరులో ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, స్థానిక ఎస్‌ఐ విజయశేఖర్‌తో కలిసి శాంతి భద్రతలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో సైతం సెల్‌ఫోన్ వాడకం అధికమైందని, దీంతో సైబర్ నేరస్థులు, మోసగాళ్ల నేరాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, అసభ్యకరంగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పల్లె సీమలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పేకాట, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, బస్టాండు సెంటర్లు, దేవాలయాలు చర్చిలు, మసీదులు తదితర ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

నంద్యాలకు చేరుకున్న ఉత్సవమూర్తులు


ప్రత్యేక పల్లకీలో మహానందీశ్వరుడి ఉత్సవమూర్తులు

మహానంది/నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది నుంచి మహానందీశ్వరుడి ఉత్సవమూర్తుల విగ్రహాలు నంద్యాలకు చేరుకున్నాయి. ఆదివారం ఆత్మకూరుబస్టాండు సమీపంలోని గణపతి ఆలయం వద్దకు నంద్యాల బ్రహ్మానందీశ్వర స్వామి ఆలయ ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులు మురళిక్రిష్ణ మేళతాళాలతో వెళ్లి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా బ్రహ్మానందీశ్వరుడి ఆలయానికి చేర్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసాక తిరిగి ఉత్సవమూర్తులను మహానందికి చేరుతాయని ఈవో తెలిపారు. కార్యక్రమంలో మహానందీశ్వరస్వామి దేవస్థానం ఈవో, ఏఈవో, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాలను అన్నిరకాలుగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానంద రెడ్డిలు కొణిదేల గ్రామానికి చెందిన శ్రావణికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ 2.50 లక్ష ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రానాథరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అల్లూరులో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, మాండ్ర

అనాథ పిల్లలకు అండగా ఉంటాం

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనాథ పిల్లలకు అండగా ఉంటామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి భరోసా యిచ్చారు. ఆదివారం అల్లూరులోని మాండ్ర నివాసానికి కొత్తపల్లె మండలం ముసలిమడుగు గ్రామస్థులు అనాథలైన పిల్లలతో ఎమ్మెల్యేను, మాండ్ర శివానందరెడ్డిలను కలిశారు. కుటుంబ పెద్ద చనిపోగా, భార్య ఐదుగురి చిన్నపిల్లలతో కనీసం ఇల్లు కూడా లేని దీనావస్థతో ఉందని ఆదుకోవాలని కోరారు. అప్పటికప్పుడు కొత్తపల్లె తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. గ్రామంలోనే పక్కా ఇల్లు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీయం జిల్లా నాయకులు నాగేశ్వరారావు, గోపాలక్రిష్ణ, హమాలి వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణను విరమించుకోవాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రానికి మంజూరైన 10 వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ నిధులతో నిర్మించాలన్నారు. ఆరోగ్యశ్రీలలో బీమా విధానాన్ని విరమించుకోవాలని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, కిరణ్ తదితరులున్నారు.

29న జాబ్‌మేళా

ఆత్మకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 29న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగించుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కోరారు. ఆదివారం వెలుగోడు మండలంలోని వేల్పనూరులో గల ఆయన స్వగృహంలో జాబ్‌మేళా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 29న ఆత్మకూరులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, డి ప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, టీడీపీ నాయకులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా ఉన్నారు.


జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్

భక్తిశ్రద్ధలతో జగజ్జననీ మాత మండల దీక్ష

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని జగజ్జననీ ఆలయంలో మాత మండల దీక్షను భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు మాట్లాడుతూ మండల, అర్ధ మండల దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. నవంబరు 1 నుంచి 5వ తేదీలోగా దీక్షలు నంద్యాల జగజ్జననీ దేవాలయంలో విరమణ చేయవచ్చునన్నారు. భక్తులకు దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించి దీక్ష నియమాలు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలదేవస్థానంలోని నిత్యకళారాధనలో భాగంగా ఆదివారం సజ్జప్ప కూచిపూడి కళాక్షేత్రం కరీంనగర్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. పలు గీతాలకు చైత్రిక, వైదేహి, మహాలక్ష్మి తదితరులు నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనను చూసి భక్తులు మంత్రముగ్ధులైయ్యారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు

నందికొట్కూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా నియోజకవర్గంలోని పలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం నందికొట్కూరు జీవనజ్యోతి సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద, బిజినవేముల వద్ద, పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలోని అభయాంజనేయస్వామికి అమావాస్య పూజలు ఆదివారం నిర్వహించారు. అనంతరం బెల్లరి చిన్నవెంకటస్వామి, లింగమ్మ దంపతులు సూర్యనారాయణ జ్ఞాణకార్థం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అభయాంజనేయస్వామి కమిటీ సభ్యులు భార్గవ, బాలరాజు, రమణయ్య, లక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన శ్రీఅభయాంజనేయ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భజన కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనలతో పాటు ధూప, నక్షత్రహారతులను నివేదించారు. అర్థరాత్రి 12గంటలకు మహామంగళహారతిని సమర్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.


సామూహిక తర్పణాలు కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణులు

నంద్యాల కల్చరల్: నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మహాలయ అమవాస్య సందర్భంగా సామూహిక తిలతర్పణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొంకల వెంకటశేషఫణి సహకారంతో బ్రాహ్మణులు 40మందికి పైగా పాల్గొని వారి వారి పితృదేవతలకు భక్తిభావంతో తర్పణములను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్, మురళీక్రిష్ణ, రాజశేఖర్, శక్లా, ఆదినారాయణ, కృష్ణమోహన్, వర్మ, శారదావాని, ప్రశాంతి, స్వర్ణలత, పావని, రేణుక, మల్లికా తదితరులు పాల్గొన్నారు.

బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు

శ్రీశైలం,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా శ్రీశైలక్షేత్రపాలకుడైన బయలు వీరభద్రస్వామివారికి దేవస్థానం ఆధ్వర్యంలో విశేషపూజలను జరిపారు. పరోక్షసేవలో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, పశ్చిమబెంగాల్ తదితర ప్రాంతాల నుంచి 30 మంది భక్తులు ఈ విశేష పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపారు. భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటీవీ/యూ ట్యూబ్ ద్వారా వీక్షించే అవకాశం కల్పించారు.

నేటి నుంచి ఉత్సవాలు

పాణ్యం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దసరా ఉత్సవాలను నేటి నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈవో సువర్ణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న శ్రీదేవిగా, 23న శ్రీగౌరీదేవి, 24న శ్రీపార్వతీదేవి, 25న రాజరాజేశ్వరి, 26న అన్నపూర్ణ, 27న శ్రీలలితాదేవి, 28న శ్రీకాత్యాయిని, 29న సరస్వతిగా, 30న శ్రీ దుర్గాదేవి, 1వతేదీన శ్రీమహాలక్ష్మీగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 2న అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబానగర్, ఫక్కీర్‌పేట, శ్యాంనగర్, రామకృష్ణ పీజీ కళాశాల సమీపంలోని లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల నీరు భారీగా ప్రవహిస్తోందన్నారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సాయిరాం రాయల్, భాస్కర్, ఖాజా, బాలకృష్ణ పాల్గొన్నారు.


ఫక్కీర్‌పేట సమీపంలోని చామకాల్వను పరిశీలిస్తున్న ఫిరోజ్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాణ్యం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా స్వామివారికి అష్టోత్తర శత క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు రద్దీ తక్కువగా ఉండటంతో అన్నసత్రం బోసిపోయింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వీరయ్యస్వామి, సురేష్‌శర్మ, ఈఓ రామకృష్ణ సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి

మహానంది, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానందిలో 11 రోజులపాటు నిర్వహిస్తున్న దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దంపతులకు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే బుడ్డా దంపతులకు వేల్పనూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆలయ వేదపండితులు, అర్చకులు ఎమ్మెల్యేను కలిశారు. స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

నందికొట్కూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కృషి పట్టుదల నమ్మకం ఉంటే ఏదైనా సాధించొచ్చని ఏబీఎం పాలెం కాలనీ వాసులు నిరూపించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఏబీఎం పాలెం కాలనీకి చెందిన మంజుల(సోషల్), రాణి(ఇంగ్లీష్), పావని(ఎస్జీటీ), వెంకటేశ్వర్లు(టీజీటీ తెలుగు), సునీల్ బాబు(ఎస్జీటీ) ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం సీయోను బాప్టిస్ట్ చర్చి ఏబీఎం పాలెం వారి ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులను సన్మానించారు. కాలనీవాసులు, సంఘం పెద్దలు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపెంటలో టీడీపీ కార్యకర్త బోనపల్లి స్వాములు అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక టీడీపీ నాయకులు, సింగపూర్ తెలుగుసమాజం ఉపాధ్యక్షుడు టేకూరి నాగేశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లి సత్యరాజ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, సుబ్బారావు, బొమ్మ రాజేష్, వినయ్, డీలరు మధు, దార జీవన్న, ప్రసన్న, వేమా రెడ్డి, సురేశ్,చిన్నస్వామి, మద్దిపాటి ప్రసాద్, బాస్కర్, కిరణ్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రణభేరి సదస్సును జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించనున్న రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. ఆదివారం ఆత్మకూరులో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాకీర్‌హుసేన్, బొజ్జయ్య, బాలాజీ, నిజాముద్దీన్, రాముడు, ఖలీలుల్లా తదితరులు ఉన్నారు.

రేపు ఆయుర్వేద వైద్యశిబిరం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెక్కలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మోహన్ కిరణ్ తె లిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయుర్వేద వైద్య శిబిరంలో డాక్టర్ చిట్టిబోట్ల మధుసూదన్ శర్మ, డాక్టర్ అలిబాష, డాక్టర్ ఐవీ సుబ్రమణ్యం, డాక్టర్ శ్రీలక్ష్మీ తదితర ఆయుర్వేద వైద్యులు సేవలు అందిస్తారన్నారు. వీహెచ్‌పీ నాయకులు, ఆయుర్వేద డాక్టర్లు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు వస్త్రాలు అందజేత

శ్రీశైలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి చెందిన రాజ్‌పురోహిత్ జబ్బర్‌సింగ్ స్వామి, అమ్మవార్లకు వస్త్రాలను అందజేశారు. ఆదివారం 32 పట్టు చీరలు, 11 సిల్క్ పంచెలు, పది కాటన్ పంచెలను క్యాంపు కార్యాలయంలో ఈవో ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ. రెండు లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు.

లోక కల్యాణం కోసం పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం జరిపించారు. ముందుగా అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు.



వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

• యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

డోన్ రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య అభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు ఎన్ఎస్ బాబు పాల్గొన్నారు.

● **రణబేరీని జయప్రదం చేయండి:** ఈ నెల 25వ తేదీ గుంటూరులో జరిగే రణభేరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం చింతకుంట గ్రామానికి చెందిన బ్రాంహానందరెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డిని టౌన్ ఎస్ఐ నగీన ఆధ్వర్యంలో ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. గత ఏడాది నవంబరులో చరణ్‌రెడ్డి చదువు కోవడం ఇష్టం లేక ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చరణ్‌రెడ్డి తెలంగాణ సరిహద్దులో ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో అతడిని తీసుకొని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా తండ్రి బ్రాహ్మానందరెడ్డి పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వర్షాలకు కూలిన గోడ


కూలిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం గోడ

రుద్రవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శనివారం రాత్రి మండలంలోని యల్లావత్తుల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం గోడ కూలింది. రాత్రి కూలడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. ఈఆలయం సుమారు 500 సంవత్సరాల క్రితం నిర్మించిందని స్థానికులు తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: ఎస్ఐ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు గ్రామాల్లో సత్ప్రవర్తనతో మెలగాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లను కోవెలకుంట్ల పోలీసుస్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సె లింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్కా, పేకాట, నాటుసారా వంటి వాటిని నిర్వహిస్తే వారిపై క్రిమి నల్ కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం


ధర్మవరం సుబ్బారెడ్డితో నూతన జర్నలిస్టు కమిటీ నాయకులు

డోన్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు అండగా ఉంటామని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో డీఏజేయు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి మల్లికార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళి, కోశాధికారి సేగు కళ్యాణ్, ఉపాధ్యక్షులు, సుధాకర్ యాదవ్, లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారులు రాజు, సహాయ కార్యదర్శులు మణిధర్, నాగరాజుతోపాటు కమిటి సభ్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్-6 పథకాలను అమలు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, వాసు, పుల్లయ్య, సిద్ధప్ప, లాలయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ గౌడ్

అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి బీసీ వినతులను స్వీకరించారు. అప్పటికప్పుడే కొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

పేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. 69 మంది నిరుపేదలకు రూ.48.65 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. అత్యవసర వైద్యసేవల నిమిత్తం లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద రూ.4 లక్షల విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. బాధితులు సీఎం చంద్ర బాబు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిం అభివృద్ధికి కృషి

సంజామల: ముస్లింల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సంజామల గ్రామానికి చెందిన ముస్లిం మత పెద్దలు బనగానపల్లెలోని మంత్రి కార్యాల యంలో ఆయన్ను కలిసి వారి సమ స్యలను విన్నవించుకున్నారు. సంజామలలోని జామియా మసీదుకు సంబంధించిన 2.70ఎకరాల్లోని భూమిని రామ్‌కో రైల్వే లైన్ ఏర్పా టుకు పోయిందన్నారు. ఇందుకు సంబంధించి రూ.33లక్షల పరిహారాన్ని రామ్‌కో సిమెంట్ వారు అందజేశారని ఆమొత్తం నగదు వక్ఫ్‌బోర్డు స్వాధీనపరుచుకుందన్నారు. ఈ నగదును మసీదు కమిటీకి అప్పజెప్పాలని మంత్రిని కోరారు. పెండేకంటి కిరన్ కుమార్, మాబూ సాహేబ్, ఖాజా హుసేన్, ఖాజా మొద్దీన్, ఇస్మాయిల్, ఖలీల్, హుసేన్ బాషా, మాజీ ఎంపీటీసీ యూసుఫ్ హుసేన్, మగ్బూల్ పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

దుకాణదారులకు అండగా ఉంటాం

కోవెలకుంట్ల పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాదారులకు అండగా ఉంటామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణాలు నడుపుతున్న 90మంది దుకాణాదారులు మంత్రిని కలిశారు. 20శాతం బాడుగను పెంచి యోచన గ్రామ పంచాయతీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. మంత్రిగా మీరు అడ్డుకొని న్యాయం చేయాలని కోరారు.

కంబగిరిస్వామి ఆలయ ఆభివృద్ధికి కృషి

అవుకు: మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆలయం ఈవో రామక్రిష్ణ, సిబ్బంది బనగానపల్లెలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీని కలిశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు : సీఐ


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఎర్రగుడి గ్రామంలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ గోపాల్, ఏఎస్‌లు బాబా ఫక్రుద్దీన్, గోవింద నాయక్, పోలీసులు వీధుల్లో కవాతు నిర్వహించి, అనుమానస్పద ప్రదేశాలు, ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులకు సీఐ అవగాహన సదస్సు నిర్వహించారు.

జీఎస్టీ తగ్గించడం హర్షణీయం


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు జీఎస్టీ తగ్గించడం హర్షణీయమని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని పాతబస్టాండులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. హేమసుందర్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని రకాల మెడిసిన్‌పై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి వస్తువుపై జీఎస్టీ తగ్గించడం పేదలకు ఎంతో ఉపశమనం కలుగు తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, రామచంద్రనాయుడు, రాజ్‌పుత్ కమలేష్, కోలా వెంకటేశ్వర్లు, ముది రాజ్ లక్ష్మీనారాయణ, వేమారెడ్డి, నారాయణ గౌడు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు ఆలయాల ముస్తాబు

నేటి నుంచి శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం


చాగలమర్రి, శిరివెళ్ల, బేతంచెర్లలో ముస్తాబైన ఆలయాలు

చాగలమర్రి/ శిరివెళ్ల/ ప్యాపిలి/ కోవెలకుంట్ల/ దొర్నిపాడు/ బేతంచెర్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలకు జిల్లాలోని పలు మండలాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు. సోమవారం నుంచి ఆయా ఆలయాల్లో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

దసరా వేడుకలకు హాజరు కావాలి


బీసీ రాజారెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్యులు

బనగానపల్లె, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగళవారం పేటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 22 నుంచి నిర్వహించే దసరా ఉత్సవాలను హాజరు కావాలని ఆర్యవైశ్యులు ఆదివారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని ఆహ్వానించారు. బీసీ రాజారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి స్వామి వారి చిత్రపటం, ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గోపాల్, అన్వే ష్‌కుమార్, జంగంశెట్టి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన ఎస్పీ

బనగానపల్లె, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నూతన ఎస్పీ సునీల్ షెరాన్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని శాంతిభద్రతలపై ఎస్పీ మంత్రి బీసీతో చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఎస్పీని కోరారు. ప్రజలకు రక్షణ కల్పించడం, బాధితులకు సత్వర న్యాయం అందించడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు.


బీసీ జనార్దన్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

చౌడేశ్వరి ఆలయానికి విరాళం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజినవేముల గ్రామంలోని చౌడేశ్వరి ఆలయ నిర్మాణానికి ఏఎస్ఐ బత్తుల ఓబులేసు నిర్వాహకులకు రూ.10వేలు విరాళం అందించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు బత్తుల సుంద రమ్మ, బాలన్నల జ్ఞాపకార్థం రూ.10వేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

ఘనంగా మహాలయ అమావాస్య

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం మహాలయ అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పిత్రు దేవతలకు ఇష్టమైన ఆహారాన్ని నైవేద్యంగా సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

బనగానపల్లె, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్ డొమిస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ లలిత ఆదివారం తెలిపారు. ఈ కోర్సుకు ఇంటర్ ఆపైన చదవిన వారు అర్హులన్నారు. వివరాలను 9705998056 నంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రజాప్రతినిధుల సమస్యలే పరిష్కరించడం లేదు

● ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?
● మండల సమావేశంలో హరివరం ఎంపీటీసీ ఆవేదన

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత ఐదు ఏళ్లుగా ఉన్న తన సమస్యనే పరిష్కరించలేదని, అలాంటిది ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారంటూ హరివరం గ్రామ ఎంపీటీసీ పెద్ద పేరయ్య హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగమ్మ అధ్యక్షతన ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమా వేశం జరిగింది. ఆయా శాఖల అధికారులు వారివారి ప్రగతి నివేదిక లను చదివి వినిపించారు. అయితే హరివరం గ్రామ ఎంపీటీసీ తన భార్య పేరు మీదుగా గృహ మంజూరుకు దరఖాస్తు చేసుకోవటానికి వెళ్తే, తన భార్య ఆధార్ వేరే వారికి అనుసంధానం అయిందని హౌసింగ్ అధికారులు చెప్పారన్నారు. దానిని వెంటనే పరిష్క రించి, గృహం మంజూరు చేస్తామని చెప్పి, ఐదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు ఆ సమస్యను పరిష్కరించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రజా ప్రతినిధుల సమస్యలే పరిష్కరించని వారు ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సరిగా లేకపోవడం వల్లే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని అల్లూరు గ్రామ సర్పంచ్ క్రిష్ణవేణి ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కార్య కర్తలు సమయానికి రావడం లేదన్నారు. చిన్న వయస్సు నుంచి ఇంగ్లీష్ మీడియం బోధిస్తే అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని సూచించారు. ఈవిషయంలో ఐసీ డీఎస్ సూపర్ వైజర్, ఎంఈవో మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ పేరయ్య

పురాతన బావికి పూర్వ వైభవం

● ఇటిక్యాలలో యువకుల శ్రమదానం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామంలో పలువురు యువకుల శ్రమదానంతో పురాతన బావికి పూర్వ వైభవం వచ్చింది. గ్రామ సమీపంలో ఒకప్పుడు ప్రజల దాహార్తిని తీర్చిన మెట్ల బావి కాలక్రమేణ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇటిక్యాల, చింతలాయపల్లె గ్రామాలకు చెందిన పలువురు యువకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు స్పందించి ఆదివారం శ్రమదానం చేసి బావిని బాగు చేశారు. యువకులను టీడీపీ నాయకులు తోట శివారెడ్డి, విశ్వహిందూ పరిషత్ చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసులు అభినందించారు.


కంప చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం శింగవరం గ్రామానికి చెందిన చిన్నారి షేక్ హసీనాకు రూ.40 వేలు సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైనట్లు గ్రామ టీడీపీ నాయకులు శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్ ఆదివారం తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంజూరు చేయించిన చెక్కును చిన్నారి షేక్ హసీనా కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి బీసీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రుద్రవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్ 19 విభాగంలో ఎస్‌జీఎఫ్ క్రీడాపో టీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఈ నెల 19న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు భార్గవి, అనుష్క, సాయికుమార్, మహేశ్వరి, నరేంద్ర, యశ్విని, జూనియర్ ఇంటర్‌విద్యార్థిని భార్గవిలు ఉన్నారన్నారు. వీరిని అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

బేతంచెర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు కేసు నమోదు అయినట్లు ఏఎస్ఐ అబ్దుల్ నబీ ఆదివారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన మేరకు.. కొడుకు అనారోగ్యంతో ఉండటంతో భార్యభర్తలు ఇద్దరు ఘర్షణ పడ్డారు. దీంతో ఈ నెల 19న ఆమె తన కూతురు, కొడుకుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సమీప బంధువులను విచారించిన వారి ఆచూకీ తెలియలేదన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

168 హెక్టార్లలో పంట నష్టం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు 168 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 93 హెక్టార్లలో వరి, 27 హెక్టార్లలో కంది, 43 హెక్టార్లలో మొక్కజొన్న, 5 హెక్టార్లలో పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం..

• విద్యార్థులకు ఉపకార వేతనాలు
• ఏడాదికి రూ.12 వేలు చొప్పున సాయం
• 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
• ఈనెల 30 వరకు గడువు

చాగలమర్రి/కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి చదువుతున్న పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. 8వ తరగతి చదివే పిల్లలకు ఏటా పరీక్ష నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచే వారికి 4ఏళ్ల పాటు ఉపాకార వేతనం అందిస్తారు.

అర్హులు ఎవరంటే..

ప్రభుత్వ, జిల్లాపరిషత్, ఎయిడెడ్, గురుకుల ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయడానికి అర్హులు. వీరు 6, 7 తరగతుల్లో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు అర్హతగా నిర్వహించారు. తల్లిదండ్రులు వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు మించి కూడదు. పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో విద్యార్థులు చదువుతుండాలి. నవోదయ, కేంద్రియ విద్యాలయాల్లో చదివే వారు, ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారు అనర్హులు.

పరీక్షా విధానం ఇలా..

పరీక్ష మొత్తం అబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాదానాలు రాయాలి. రీజినింగ్, అర్థామ్యాటిక్, గణితం, సైన్స్, సోషల్ అంశాలకు సంబంధించి ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో ప్రతిభ చూపిన వారిని స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేస్తారు.

ఏడాదికి రూ.12 వేలు


అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 4 ఏళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్ అందు తుంది. నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు.

దరఖాస్తు ఎలాగంటే..

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం 2025-26 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వార రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్ష రుసుంగా రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలి. పరీక్షా రుసుము ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్టు లింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది. డిసెంబరు 7న పరీక్ష నిర్వహిస్తారు.



విద్యార్థులను ప్రోత్సహించాలి



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రభు త్వ పాఠశాలలో హెచ్ఎంలు చొరవ చూపాలి. ఈ పరీక్ష విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకని విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

- అబ్దుల్‌కలాం, ఎంఈవో, కొలిమిగుండ్ల